## మానవుని దృష్టి పరమాత్మ వైపు మరల్చినపుడే నిజమైన సుఖము లభిస్తుంది

**మనసు నిర్మలంబు మంచికి మార్గంబు**
**మనసు నిర్మలంబు మహితశక్తి**
**నిర్మలంబు మనసు వుండినది ముఖ్యంబె**
**మరచిబోకు డిట్టి మంచిమాట.**

**ప్రేమస్వరూపులారా!**

మానవజీవిత వికాసమునకు మహత్తరమైన ప్రక్రియ ఆత్మవిశ్వాసమే! ఈనాడు యిట్టి ఆత్మ విశ్వాసము కోల్పోవటంచేత జీవితము అస్తవ్యస్తమైన మార్గములో ప్రయాణము సలుపుతున్నది. మానవుడు పుట్టినప్పుడు ఎట్టి దుర్గుణములు లేక నిర్గుణ స్వరూపుడై వుంటాడు. కాని కాలము గడచిన కొలది, ఆహారము మారిన కొలది, అభిరుచులు అబివృద్ధి అయ్యేకొలది మానవ జీవితము కొంత పెడమార్గము పడుతుంది. సహవాస దోషము మానవునకు దుర్గుణములను అభివృద్ధి చేయుట కవకాశము నందిస్తుంది. ఇలాంటి దుర్గుణములే మానవునకు యీనాడు కేవలము ఒక అభిలాషగాను, అభిరుచిగానూ ఏర్పడుతూ వచ్చాయి. అప్పుడే మానవునియందు రాగ ద్వేషములు చోటు చేసుకుంటున్నాయి. తదుపరి చదువు సంధ్యలు ప్రారంభము కాగానే దానితో పాటు ఆకర్షణ, అభిమానము, అహంకారము, మమత్వము అనే దుర్గుణములు శరీరములో ఆపాద మస్తకము వ్యాపించి వీర నాట్యము ఆడుతుంటాయి. విద్యయొక్క విశిష్టత వివేకమనే విషయమును మరచిపోయి కేవలము తనకు తానే పెద్దగా భావించుకొని తనకంటె ఎవరు పెద్దలు లేరని భావిస్తూ వుంటాడు.

**జీవితంలో ఎదురయ్యే ఎదురు దెబ్బలకు తట్టుకుని ముందుకు సాగినవాడే సరైన మానవుడు**

యువకులైనవారు యేదో స్నేహమునందు పరుగులెడుతూ వుంటారు. యవ్వనమత్తులో ఉన్మత్తులై ఎదుటివారిని ఒక గడ్డిపోచకంటె హీనముగా చూస్తూ వుంటారు. మానవుడు మానవుడుగా బ్రతకవలెనన్న మనిషి మనిషిగా జీవించవలెనన్న అమితమైన కష్టములను,

sri sathyasai vachanamrutam

నష్టములను, ఎదుర్కొనవలసి వస్తుంది. జీవితములో యెదురయ్యే ఎదురు దెబ్బలకు తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగే మానవుడే సరైన మానవుడని గుర్తించాలి. కానీ మానవుడు యీనాడు అట్టి కష్టములకు, నష్టములకు, నిందలకు, నిష్ఠూరములకు లొంగిపోయి, యింద్రియములకు బానిసై, ఆడంబరములకు, అహంకారములకు అవకాశము నందించి జీవితమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. ఈనాటి మానవుడు అల్లరి చిల్లరి చిత్తమునకు, విషయములకు లొంగిపోతున్నాడు. ఈనాటి మానవునియొక్క దాహము, వివాహము. ఇలాంటి దాహమునకు దాసుడై మానవత్వమును మరచిపోతున్నాడు. యీనాటి మానవుడు 'నేను మానవుడనా'? అనే ప్రశ్న వేసుకుంటే సరైన జవాబు యే మానవునియందు లభించుటము లేదు. పవిత్రమైన మానవత్వము అర్థం చేసుకొనలేక కేవలం చిల్లర విషయములలో ప్రవేశించి తమలోని దివ్యత్వమును పవిత్రమైన ఆత్మతత్త్వాన్ని విస్మరిస్తున్నారు. అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన సుఖ సంతోషములకు ఆశపడి నిత్య సత్య నిర్మలమైన ఆత్మతత్త్వాన్ని మరచిపోతున్నారు. నిజానికి భౌతికమైన విషయములందు మానవునికే మాత్రము ఆనందం లేదు. 'సర్వం ఆత్మమయం సుఖం, సర్వం ప్రకృతిమయం దుఃఖంః'. కనుకనే మానవునియొక్క దృష్టి పవిత్రమైన పరమాత్మతత్త్వమువైపు మరల్చినప్పుడే నిజమైన సుఖము అతనికి ప్రాప్తిస్తుంది.

## చెప్పుట ఒకటి, చేయుట మరొకటి కావడంవల్లనే మానవత్వము నశించిపోతోంది

ఈనాటి మానవుడు పుణ్యఫలము నాశిస్తున్నాడు, కాని, పుణ్య కార్యములందు ముందంజ వేయటం లేదు. పాపఫలమును విస్మరిస్తున్నాడు. కాని పాప కర్మలాచరించటానికి ముందంజ వేస్తున్నాడు. చెప్పుట ఒకటి, చేయుట మరొకటి కావడంవల్లనే మానవత్వము అడుగంటిపోతోంది. అవకాశవాదమునకు పాల్పడుతున్నాడు. ఈనాటి మానవుడు తాను తిని సంతృప్తిపడటం లేదు. పశుపక్షి మృగాదులు తమ తిండి తాము తిని ఆనందమును అనుభవిస్తున్నాయి. దాచుకొనే స్వార్థము గాని, దోచుకునే దౌర్భాగ్యము గాని లేదు. కాని, మానవుడు అట్లు కాదు. తాను తిని సంతోషించటమే కాకుండా కొన్ని తరములకు, యుగములకుకూడను సరిపడే పదార్థములను ప్రోగుచేసుకొంటున్నాడు. తనకే కాకుండా, పంచవర్ష ప్రణాళికలు వేస్తూ ఐదు తరములకు సరిపడా వస్తు వాహనములను

sri sathyasai vahanamrutam

ప్రోగుచేసుకోటంలో అనేక విధములుగా అవస్థల పాలౌతున్నాడు. ఎన్ని కష్టములనైనా ఓర్చుకొని లౌకికమైన, భౌతికమైన పదార్థములను ప్రోగుచేసుకుంటున్నాడు. కాని, నిత్య సత్యమైన దైవత్వమును అభివృద్ధి గావించుకోటానికి క్షణకాలమైన వినియోగించటము లేదు.

**కోరికలు మితంగా, హితంగా ఉన్నప్పుడు మానవునికి సుఖశాంతులు లభిస్తాయి.**

ఈనాడు ప్రపంచములో కరవు, కాటకములకు కారణము ఏమిటి? చుట్టూ వుండిన ఆశలే మూలకారణము. కూటిపేదనుండి కోటీశ్వరునివరకుకూడను యీ ఆశలు పెరిగిపోతున్నవి. పండితుని మొదలు పామరునివరకు, బాలుని మొదలు వృద్ధునివరకు యీ ఆశలు పెరిగిపోతున్నవి. 'నేను గొప్ప గాయకుడు కావాలి, నేను గొప్ప నటుడు కావాలి, నేను గొప్ప వ్యాపారస్థుడు కావాలి, నేను గొప్ప అధికారిని కావాలి, నేను గొప్ప విద్యావంతుడను కావాలి', ఈ విధమైన కోరికలు చీమల పుట్టలవలె పెరిగిపోతున్నాయి. కోరికలు కోరడం ఆశ పడటంలో తప్పులేదు. కానీ, మితిమీరిన ఆశలు ప్రమాదమును కలిగింపచేస్తాయి. ప్రతి మానవునకు ఆహారము అవసరము. అట్టి పవిత్రమైన ఆహారమును మితముగా భుజించినప్పుడు తనకది ఆరోగ్యమును అందిస్తుంది. కాని, అతిగా భుజించినప్పుడు అదే విషముగా మారిపోతుంది. కోరికలు మితమైనరీతిగా, హితమైనరీతిగా ఉండినప్పుడు మానవుడు శాంతి, సుఖములు అనుభవించగలడు. ఈనాడు నాగరికత పెరిగినకొలది మానవత్వములోని మృదుత్వము, మధురత్వము క్షీణించిపోతున్నది. ఆధునిక యుగము సుఖశాంతులను దూరము గావించుచున్నది. వైజ్ఞానిక శాస్త్రము పెరిగిపోయినదని విఱ్ఱవీగుతున్నాము. కాని, యిది వెఱ్ఱితనము. దీనివలన ఒనగూడే అనుకూలములు యేదో కొంతవరకు మనము అనుభవించవచ్చునేగాని అవి ఆత్మశాంతిని అందించలేవు. కార్లు వచ్చాయి. వీడియోలు వచ్చాయి. ప్లేనులు వచ్చాయి. సినీమాలు వచ్చాయి, అయితే వీటివల్ల మనశ్శాంతి లభిస్తున్నదా అంటే ఏదో కొంతవరకు మాత్రమే అనుకూలములు చేకూర్చవచ్చుకానీ, ఆత్మశాంతి వీటివల్ల లభించేది కాదు. విజ్ఞానమునకు మనస్సనేది లేదు. ఆత్మ అనేది అర్థమే కాదు. పవిత్రమైన హృదయము అసలే లేదు. పవిత్ర మనస్సనేది లేనిదే విజ్ఞాన శాస్త్రము. ఎప్పుడూకూడను పదార్థము యొక్క పరిశోధన. ఇట్టి పదార్థ విజ్ఞానశాస్త్ర పరిశోధనయందే పవిత్రమైన తన మానవత్వమును

srisathyasaivachanamrutam

వ్యర్థము చేసుకుంటున్నాడు, మానవుడు. దీనివలన పరమార్థమైన దివ్యత్వమును మానవుడు అందుకోలేడు. అసూయ, ద్వేషము, అహంకారము, యిలాంటి దుర్గుణములే అభివృద్ధిగాంచుతాయి.

**మానవుడై పుట్టినవాడు పవిత్రమైన నేత్రములతో పవిత్ర దృశ్యములను చూడాలి**

కామ, క్రోధ, లోభములను క్రమేణా మనము దూరము చేసుకొనుటకు ప్రయత్నించాలి. ఈనాడు మానవుడు ప్రపంచములో స్వేచ్ఛా విహారము సల్పాలని ఆశిస్తున్నాడు. 'స్వేచ్ఛ' అనగా యేమిటి ? ఇష్టము వచ్చినట్లుగా సంచరించటమా? ఇంద్రియములకు లోను కావటమా ! ఇంద్రియములను తన యిష్టము వచ్చినట్లుగా అనుభవించడమే స్వేచ్ఛ అని భావిస్తున్నాడు, యీనాటి వెఱ్ఱి మానవుడు. కాదు, కాదు ఇంద్రియములను అదుపులో వుంచుకోవాలి. స్వేచ్ఛా విహారమున కవకాశము అందించరాదు. ఇంద్రియములకు బానిసై స్వేచ్ఛా విహారము సలుపుతున్నాడంటే యింద్రియములయొక్క తత్త్వము యేమిటో గుర్తించలేని అంధుడే వీడు. ఏకత్వమును అనేకత్వముగా భావించి, దివ్యత్వమును విస్మరించి, అపవిత్రములో మునుగుతున్నాడు. అనేకత్వములోని యేకత్వమును గుర్తించటానికి ప్రయత్నించాలి. పశుపక్షి మృగాదులకుకూడా కన్నులు వుంటున్నాయి. పవిత్రమైన మానవ జన్మ అని చెప్పికూడను కేవలం చర్మ చక్షువులతోనే చూడడానికి ప్రయత్నించడం మానవజన్మకే సిగ్గుచేటు. చీమలకు, దోమలకు కన్నులుంటున్నాయి. మానవుడై పుట్టినవాడు పవిత్రమైన నేత్రములతో పవిత్రమైన దృశ్యములను చూడాలి. సమస్త యింద్రియములను సరైన మార్గములో ప్రవేశింపజేయాలి.

**కామ, క్రోధ, లోభములనే దుర్గుణములను నిర్మూలించడమే కలియుగ మానవుని ధర్మము**

పవిత్రమైన భారతీయ చరిత్రలలోపల రామాయణ, భాగవత, భారత గ్రంథములు చాలా ఆదర్శమైన గ్రంథములు. వీటిలో వున్న ఆదర్శములను మానవుడు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. వింటున్నాడు. ఉపన్యసించుచున్నాడు. అదే బోధిస్తున్నాడు. కానీ, అంతరార్థమేమిటో గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. రామాయణములోని రావణుడు కాముడు. రావణాసురునికి కావలసిన సకల సౌఖ్యములు, సంతోషములు, భోగములు, బలములు అన్నీ వుంటున్నవి. అతనియొక్క శక్తిని ఎదిరించేవాడు లేదు. మహా భక్తుడు. ఇలాంటి

srisathyasaivachanamrutam

గొప్పగుణములు కలిగిన రావణునియందు కామము ప్రవేశించి అతనిని వశము చేసుకుంది. కనుకనే జనబలము, ధనబలము, బుద్ధిబలము, అంగబలము, సర్వబలములు వుండినప్పటికి తన వంశమునే నాశనము చేసుకున్నాడు, కామము చేత.

భాగవతమందు హిరణ్య కశిపుడు. తనకంటె దేవుడు మరొకడు లేడని సమస్త లోకములు తననే దేవునిగా విశ్వసించాలని శాసించాడు. నారాయణుడు లేడని చెప్పి నారాయణ ద్వేషిగా మారిపోయాడు. అనేక విధములుగా పరిశోధనలు చేశాడు. పరిశీలనలు సలిపాడు. ఇతను హరిద్వేషి. కాని, కట్టకడపటికి ఏమయ్యాడు? హరిని ద్వేషించటము, యిదే క్రోధము. క్రోధమంటే హిరణ్యకశిపుడే! ఇంక భారతమునందు దుర్యోధనుడు సర్వుల ఆస్తిని తానే అనుభవించాలని, ఆనందించాలని ఆశపడేవాడు. త్యాగము అనేది అతనికి యేమూలను కనిపించదు. ఇతను లోభి. ఈ లోభియైన దుర్యోధనుడు కడపటికి ఏమైపోయాడు? సర్వము నిర్మూలము గావించుకున్నాడు.

రామాయణములో రావణుడు కామము, భాగవతమునందు హిరణ్యకశిపుడు క్రోధము, భారతమునందు దుర్యోధనుడు లోభి. ఒక్కొక్క చరిత్రయందు ఒక్కొక్క దుర్గుణముతో నాశనమైన వ్యక్తుల చరిత్రలు ఇవి. కానీ, ఈ కలియుగమందు ప్రతి మానవునియందు కూడను కామ, క్రోధ, లోభమనేవి మూడూకూడా నిండి నిబిడీకృతమై వుంటున్నాయి. అలాంటి మానవులు రామాయణము పఠించి ఏమి ప్రయోజనము? భాగవతము పఠించి ఏమి ప్రయోజనము? మహాభారతము పఠించి ఏమి ప్రయోజనము? కామ, క్రోధ, లోభములు నిర్మూలము గావించాలి. ఇది ఈనాటి కలియుగ మానవుని ధర్మము.

**ఎట్టివారు నిన్ను సాధింపగా లేరు**
**ధర్మము ఎప్పుడు నీవు తప్పకుండు**
**భారతమ్ములోని మహాభాగ్యమిదెకదా!**

ఈ ధర్మమనేది ఎంత పవిత్రమైనదో మానవుడు యేమాత్రము విచారించటము లేదు. ధర్మము చాలా పవిత్రమైనది కనుకనే మానవునకు ఆధారమైనది.

**ధర్మము దైవస్వరూపము**

sri sathyasai vahini vachanamrutam

కనుకనే 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అని మొట్టమొదట ధర్మముతో ప్రారంభించాడు కృష్ణుడు, భగవద్గీతను. యుద్ధమునకు సిద్ధమైన దుర్యోధనుడు తనతల్లియైన గాంధారికి నమస్కారము చేయటానికి వస్తున్నాడు. తల్లికి నమస్కరిస్తే తల్లి దీవించింది. 'యతో ధర్మస్తతో జయః' అంది. 'ఎక్కడ ధర్మమో! అక్కడ జయము అవుతుంది నాయనా'! అంది. అంతేగాని నీకు జయము కావాలని కోరలేదు, ఆమె. ఈనాటి తల్లులు తమ కుమారులు దుర్మార్గులు, దుష్టులు, దురాచార సంపన్నులు అయినప్పటికి వారికే జయము కలగాలని ఆశిస్తూ వుంటారు. ఇది నిజమైన తల్లియొక్క లక్షణమా? తరువాత దుర్యోధనుడు గురువునకు నమస్కారము చేశాడు ఆయన చెప్పాడు, 'యతో ధర్మస్తతో కృష్ణ యతో కృష్ణస్తతో జయః' అన్నాడు. అనగా 'ఎక్కడ ధర్మమో, అక్కడ కృష్ణుడు, ఎక్కడ కృష్ణుడో అక్కడ విజయము' అన్నాడు. అనగా ధర్మము, దైవ స్వరూపము. రాముడు అరణ్యమునకు వెళ్లుటకు పూర్వము కౌసల్యకు వచ్చి నమస్కారము చేశాడు. 'నాయనా! ఎవ్వరును నిన్ను రక్షించలేరు, నీ ధర్మమే నిన్ను రక్షిస్తుంది', అన్నాది. ధర్మమంటే 'ఏది యితరులు తనకు చేస్తే తనకు బాధ కలుగుతుందో ఆయొక్కపని యితరులకు చేయకుండా వుంటుండాలి. ఇతరులు తనకు ఏదిచేస్తే, ఏ విధముగా ప్రవర్తిస్తే తనకు ఆనందమవుతుందో అలాంటి ప్రవర్తన యితరుల యెడ తాను చూపించాలి! ఇతరులు మాత్రము తనను గౌరవించాలి కానీ తాను యితరులను గౌరవించనక్కరలేదా? ఇది సరికాదు ధర్మము కాదు. మనము అందరియందు వుండిన దైవత్వమును ధర్మరూపకముగా విశ్వసించి, ఆదరించాలి.

**హృదయాన్ని పవిత్రము గావించటానికి ఉపయోగపడేదే విద్య**

ఈనాడు ప్రపంచము కేవలము గుణవంతులైన స్త్రీ పురుషులపైన ఆధారపడి వుంటున్నాది. ఇలాంటి గుణవంతులైన స్త్రీ, పురుషులు ఎప్పుడు అభివృద్ధి అవుతారు? చిత్తశుద్ధి, శీలము గలిగినప్పుడే స్త్రీ, పురుషులు గుణవంతులుగా మారతారు. ఈ చిత్తశుద్ధి, శీలము దేనిపైన ఆధారపడి వుంటున్నవి? నీతి, నిజాయితీలపైనే ఆధారపడి వుంటున్నవి. ఆధ్యాత్మిక తత్త్వముపైన ఆధారపడి వుంటున్నాయి. ఏతావాతా ఆధ్యాత్మిక తత్త్వముపైనే నీతి, నిజాయితీ నిల్చి వుంటున్నాయి. ఈనాడు ఆత్మవిశ్వాసమే యెక్కడా కనిపించటంలేదు. ఆత్మవిశ్వాసము

sri sathyasai vachanamrutam

వుండినట్టుగా నటిస్తున్నారేగాని యిది యేమాత్రము ఆచరణలో కనబడటం లేదు. యేమంచి విషయమునైననూ ఆచరణలో పెట్టినప్పుడే అదే చిత్తశుద్ధి.

ఈనాటి ప్రపంచములో ధర్మోపదేశము గావించే సన్యాసత్వము అడుగంటి పోయింది. సంస్కృతి పూర్తిగా నశించిపోయింది. పరిపాలకులలో నీతి, నిజాయితీలు పూర్తిగా అదృశ్యమైపోయాయి. రక్షకులైనవారియందు క్రమశిక్షణ నశించిపోయింది. ఈ పరిస్థితులలో దేశము ఏ రీతిగా రక్షింపబడుతుంది? దేశము ఏరీతిగా అభివృద్ధి గావిస్తుంది? దేశము ఏ రీతిగా సుఖశాంతులను అనుభవిస్తుంది?

కనుకనే ఈనాడు సుబోధలు గావించే, ధర్మబోధలుగావించే, ఆత్మబోధలు గావించే సన్యాసులు అభివృద్ధి కావాలి. ఆనాడు శంకరాచార్యులు అలాంటి పవిత్రమైన మార్గమును అవలంబించటంచేతనే అనేకమందికి ఆదర్శవంతమైన జీవితమును అందించాడు. ఆనాటి మహారాజులు అనేక రకములుగా గురువులను ఆశ్రయించి, మహాపురుషులనాశ్రయించి వారిసుబోధలను ఆచరణలో పెట్టుకుంటూ వచ్చారు. వారిలో ఒక విధమైన త్యాగభావము అభివృద్ధి చెందింది. నేటి పాలకులయందు నీతినిజాయితి నిర్మూలమైపోతున్నాది. వీరు యేనాడు నీతినిజాయితీలతో ప్రవర్తిస్తారో ఆనాడే దేశప్రజలంతా సుఖశాంతులననుభవిస్తారు. అవినీతి, అసత్యము ఈనాడు education ను ఈ స్థితికి తెప్పించినవి. ఈ విద్యావిధానము కేవలము గ్రంథపరిచమువరకే ప్రయాణము చేస్తున్నదిగాని, ఆచరణయందు యేమాత్రము ప్రతిబింబించటం లేదు. కేవలము పొట్టకూటి నిమిత్తము ప్రాకులాడుతున్నారేగాని చిత్తశుద్ధి నిమిత్తము యేమాత్రము ప్రయత్నించటము లేదు. హృదయాన్ని పవిత్రము గావించుకోవటానికి తగినదే సరైన విద్య.

**దేశములో ఈనాడు అశాంతి పెచ్చు పెరిగిపోవడానికి కారణం, విద్యా విధానము పూర్తిగా భ్రష్టుపట్టిపోవడమే!**

ప్రతి మానవుడుకూడను సమాజములో ప్రవేశించి సేవలద్వారా నీతిని, నిజాయితీని పెంచటానికి ప్రయత్నించాలి. Living in God అదే Spirituality. Living with God, అదే Education. Living for God అదే Service. ఈ మూడింటి యందు దైవత్వము కూడి

వుంటుండాది. ఈనాడు దైవత్వము ఎక్కడా కనిపించటము లేదు. అందుకోసమే దేశమంతా దయ్యముమాదిరి పోతుండాది. ఎక్కడచూచినా అల్లర్లు. ఎక్కడ చూచినా అశాంతి. ఎక్కడ చూచినా విప్లవములు. ఎక్కడ చూచినా మారణ హోమాలు. కారణము ఏమిటి? అన్నింటికి ఆధారమైన విద్యావిధానము పూర్తిగా నిర్మూలమైపోయింది. ఇది కేవలము కృత్రిమమైన విద్యగా రూపొందుతున్నాది. మానవత్వము లేని మానవులుగా తయారౌతున్నారు. నిజముగా మానవునకు కావలసినది మానవత్వమే! మానవత్వము లేనివాడు ప్రాణము లేని జీవుడే! కనుక, మానవత్వమును వాడ వాడ ప్రచారము చేయటానికి, సాధించటానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలి. ఇది దేశము కోసము, దేశసౌభాగ్యము కోసము. దేశసౌభాగ్యమును ఆశించే వ్యక్తులు ఏ కొద్దిమంది వుండినా చాలును, భారతదేశము పవిత్రమైన దేశముగా ఆదర్శము నందిస్తుంది. ఈనాడు యువకులలోపల యిలాంటి విశ్వాసము అభివృద్ధి కావాలి. ఈనాడు ప్రపంచములో యింత అల్లకల్లోలములకు యింత అశాంతికి కారణము ఏమిటో గుర్తించటానికి ప్రయత్నించాలి, పెద్దలు. వారి కర్తవ్యమేమిటో వారు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. వృద్ధులైనవారు నిరంతరము గతమునే చింతిస్తూ పోతున్నారు. యువకులైనవారు ఏదో భవిష్యత్తులో ప్రపంచాన్ని వుద్ధరించాలని ఆశలు పెంచుకొంటున్నారు. ప్యాసైన తక్షణమే, ఉద్యోగము. ఉద్యోగమైన తక్షణమే ఫారిన్ టూర్, ఏమిటేమిటో ఆశిస్తూ, కలలుకంటూ future కోసమని జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నారు. చదివి ఏమి చేస్తున్నారు.? డిగ్రీ అనే భిక్షాపాత్ర తీసుకొని ఆఫీసులవెంట తిరుగుతూ ఉద్యోగమనే భిక్షను అడుగుతున్నారు. ఈ యువకులంతా సమాజసేవలో ఎందుకు ప్రవేశించరాదు.? సాటి సోదరసోదరీమణులకు ఆదర్శమును ఎందుకు నిరూపించరాదు? దీనికి తగినట్లుగా తల్లితండ్రులుకూడను పిల్లలను పెడమార్గము పట్టిస్తున్నారు. పిల్లలను అనవసరముగా ఈ విదేశములకు పంపటము. వీరి ఆశ ఏమిటి? డబ్బు. డబ్బు. ఈ విధంగా డబ్బును సంపాదించటానికే పిల్లల తెలివితేటలు ఉపయోగపెడుతున్నారు. మానవత్వమనేది నిత్యజీవితంలో ప్రతిఫలింపచేయ్యాలి. ఒక విత్తనము భూమిలో పెట్టి నీరుపోసినప్పుడే అది మొక్కగా వస్తుంది. కానీ, ఆ విత్తనమును టిన్‌లో పెట్టి నీరుపోస్తే మొక్కగా వస్తుందా? అదేరీతిగా మానవత్వము ఆధ్యాత్మికమనే భూమియందు అభివృద్ధి కావాలిగానీ లౌకికమైన భూమియందు వృద్ధికావడానికి అవకాశము లేదు.

**మానవత్వమును అభివృద్ధి గావించుకోవలెనన్న అధ్యాత్మిక శక్తిని అభివృద్ధి గావించుకోవాలి**

sri sathyasai vacharamrutam

## తేదీ. 18-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

కనుక, మానవత్వాన్ని అభివృద్ధి గావించుకోవలెనన్న ఆధ్యాత్మిక శక్తిని మనము అభివృద్ధి గావించాలి. ఆత్మవిశ్వాసము అభివృద్ధి గావించాలి. మానవుడంటే కేవలము శరీరము, మనస్సు, బుద్ధి, చిత్తము అనేది మాత్రమే కాదు. అన్నింటికంటె మించి ఆత్మతత్త్వము మానవునియందు వుంటున్నది. ఈ ఆత్మయే మానవుని దేహమునందు సర్వత్ర వ్యాపించివుంటున్నాది. దీనినే constant integrated awareness అన్నారు. నిజమైన ఆత్మతత్త్వాన్ని మరచిపోతే మనసెక్కడ వుంది? దేహము ఎక్కడ వుంది? అంతఃకరణ ఎక్కడ వుంది? ఈ ఆత్మ లేకపోతే యేమీలేదు. యింద్రియములన్నీ కేవలము జడమైనవే! ఈ జడమైన యింద్రియములలోపల ఆత్మతత్త్వమనే ప్రకాశము ప్రవేశించి తద్వారా యింద్రియములచేత పని జరిపించుచున్నాది. రాత్రి నీవు నిద్రపోతున్నావు. నీకు కన్నులుంటున్నాయి. ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నములో చూచేవాడు ఎవరు? ఈ కన్నులేనా? కాదే! ఆ స్వప్నములో మాట్లాడేవాడు ఎవరు? నీ నోరు కాదు. ఆ స్వప్నములో వినేవాడు ఎవడు? నీ చెవులేనా? కాదు! ఈ జడమైన చెవులు లౌకికమైన విషయములు వింటున్నాయి. ఈ జడమైన కన్నులు భౌతికమైన విషయములు చూస్తున్నాయి. జాగ్రత్ స్వప్న సుషుప్తియందు వుండిన ఆధారమైన ఆత్మతత్త్వమును ఈనాడు మనము మరచిపోతే, ఆత్మాన్వేషణ మనము మరచిపోతే నిజముగా మానవత్వము వ్యర్థమనే చెప్పవచ్చును. నిరంతరము భౌతికములోనే మన జీవితము వ్యర్థము గావించరాదు. అంతర్దృష్టిని అభివృద్ధి గావించుకోవాలి. అది లేకపోతే జీవితము యేమాత్రము సఫలము కాదు.

**ఈనాడు సత్కర్మలు ఆచరిస్తున్నారేగాని మానసిక పరివర్తన రావటం లేదు**

ఎన్ని సంవత్సరములనుండియో మానవులు సాధనలు చేస్తున్నారు, ధ్యానము చేస్తున్నారు, భజనలు చేస్తున్నారు, జపము చేస్తున్నారు. దీనివలన కలిగిన ఫలితమేమిటి? ఏ కించిత్తైనా మనము మారగల్గినామా? మనలో కలిగిన మార్పు ఏమిటని ఎవరికి వారు పరీక్షలు సల్పుకోవాలి. సత్కర్మలు ఆచరిస్తున్నామేగాని, సత్ క్రియలలో ప్రవేశిస్తున్నామేగాని లోపల యేమాత్రము పరివర్తన రావటం లేదు. లోకసంబంధమైన ప్రభావములకు మనము బానిసలమైపోతున్నాము. గుణమును సంపాయించటానికి యేమాత్రము ప్రయత్నించటంలేదు. వెళ్ళే సమయములో ఒక్క కాసైనా తీసుకుపోతారా? తనదికాని ధనమునకు తాను ఎందుకింత ఆశపడాలి? ఈనాడు

srisathyasaivachanamrutam

సమస్త అనర్థములకు మూలకారణము, వృద్ధులు గతాన్ని, యువకులు భవిష్యత్తును యోచిస్తున్నారుగాని వర్తమానాన్ని మరచిపోతున్నారు యిద్దరూ.

**వర్తమానము చక్కగా వుంటే దేశము సుభిక్షముగా ఉంటుంది**

ఈ వర్తమానము చాలా ప్రధానమైనది. ఇది not oridinary present ఇది omni present. ఎందుకనగా గతముయొక్క ఫలితమే ఈ వర్తమానములో వస్తున్నాది. వర్తమానములో చేసే ఫలితమే భవిష్యత్తులో వస్తుంది. కనుక, వర్తమానం చక్కగా వుంటే దేశము సుభిక్షముగా వుంటుంది. పెద్దలు ఎవరూకూడను దీనిని గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. అన్నింటిని నియమించే మానవుడు ఈనాడు అధోగతికి దిగజారిపోతున్నాడు. అన్నింటికంటె తెలివైనవాడు మానవుడు. భూమికి విలువనిచ్చేది మానవుడే! అందరికి విలువనిచ్చే మానవునికి విలువలేకుండా పోయింది! తన విలువ తాను తెలుసుకోలేకపోతే ఏమి ప్రయోజనము? ఇది కేవలము మూర్ఖత్వముగానే వుంటున్నాది. మొట్టమొదట ఈ అహంకారాన్ని, ఆడంబరాన్ని అణగద్రొక్కాలి. Puirity, divinityని పెంచాలి. సహనము, సానుభూతితో జీవించాలి. తోటి మానవునితో మనము ప్రేమతో సంచరించాలి. అదే brotherhood of man, fatherhood of God. ఏనాడు దైవమునందు విశ్వాసాన్ని అభివృద్ధిపరచుకొందురో ఆనాడే దేశము తిరిగి అభివృద్ధి గాంచగలదు. దేశము నిమిత్తమై మనము పాటుపడాలి. ఈనాటి మానవుడు తాను, తన కుటుంబము అంతవరకే ప్రయాణము చేస్తున్నాడుగాని, సమాజమువరకు ప్రయాణము చేయటంలేదు. సమాజమునకు, మనకు వుండిన సన్నిహిత సంబంధ బాంధవ్యము యేమిటో అర్థము చేసుకోవాలి. సమాజము లేకపోతే నీవు ఎక్కడ? నీవు పుట్టటము, పెరగటము, నశించటము, అంతా సమాజమునందే జరుగుతుండాది. అలాంటి ఆధారమైన సమాజమును మనము మరచిపోతున్నాము. మనము చేసే ప్రతి క్రియకూడను, ప్రతి కర్మకూడను సమాజమువరకు ప్రయాణము చెయ్యాలి. 'సమ్ ఆజమ్' అదే సమాజము. 'సమ్' అనగా ఏకత్వము 'ఆజమ్' అనగా గమనము. ఏకత్వ గమనమే సమాజము. అందరియొక్క ఏకత్వమే మన సమాజము. సమాజమును విడిచిపెట్టి మానవుడు క్షణమైనా బ్రతకటానికి వీలుకాదు. తననుండి తన కుటుంబము, తన కుటుంబమునుండి సమాజము, సమాజమునుండి దేశము,

srisathyasaivachanamrutam

దేశమునుండి విశ్వమువరకు ఏనాడు మానవుడు ప్రయాణించునో మానవత్వము ప్రసరింపజేయునో ఆనాడే విశ్వమానవులంతా సుఖశాంతులతో జీవించగలరు. 'స్వ' భావమును మనము అభివృద్ధిపరచుకోవాలి. స్వభావమే ఆత్మ భావము. ఆత్మ సర్వులయందు వుండినట్లుగానే మనము భావించాలి. ఈనాడు నూతన సంవత్సరమని భావిస్తున్నాము. ఉగాది అంటున్నాము. ఇది చంద్రమానమునకు సంబంధించినది. మానవుడు నవగ్రహములపైన ఆధారపడి వుంటున్నాడు. ఈ నవగ్రహములుకూడను మానవునికి కూడివచ్చినప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారిపోతుందని భావిస్తున్నాడు. జ్యోతిష శాస్త్రములో ఈ గ్రహములను ప్రధానముగా చూస్తారు. అదృష్టవశాత్తు ఈ సంవత్సరము రాజు, మంత్రి, సైన్యాధిపతి, శుక్రుడు, బుధుడు ముఖ్యమైనవారు అధిపతులుగా వున్నారు. నవగ్రహములలోపల ఐదు గ్రహములు చాలా ముఖ్యమైన స్థానములో వచ్చారు. ఇది దేశమునకు చాలా ఉపయోగకరమైనదిగను, ఉత్సాహకరమైనదిగను, శుభకరమైనదిగను పండితులు నిరూపిస్తూ వచ్చారు. నిజానికి భారతదేశముయొక్క సౌభాగ్యము మానవులపై ఆధారపడివున్నదిగాని గ్రహములపైన ఆధారపడి లేదు. ఈనాడు మానవునకున్నవి నవగ్రహములు కాదు, రెండే గ్రహములు. ఆ రెండే రాగద్వేషములు! ఈ రాగద్వేషములను అణచివేస్తే అన్నిగ్రహాలు మన హస్తగతమవుతాయి. కనుక, రాగద్వేషాలను మొట్టమొదట అరికట్టుకోండి. మానవత్వములోపల సహనభావమును పెంచుకోండి.

### జీవితములో ప్రతి క్షణమును ప్రేమమయము గావించి సుఖశాంతులతో జీవించండి

నిజమైన శాంతమును బలపరచుకోండి! ప్రేమతత్త్వము పెంచుకోండి! ప్రేమకు మించిన ప్రాణము మరొకటి లేదు. సత్య, ధర్మ, శాంతి, అహింసలు ప్రేమపైననే ఆధారపడి వుంటున్నాయి. దైవప్రీతి, పాపభీతి, సమాజనీతి ప్రేమపైనే ఆధారపడి వుంటున్నాయి. కనుక మనము ప్రేమమయులుగా మారినప్పుడే, జగత్తునందు శాంతి, సుఖములు అనుభవించగలము. ఈ నూతన సంవత్సరాదికోసమై ఒక సంవత్సరము కాచుకోనక్కరలేదు. సంవత్సరమంతా పన్నెండు నెలలపైన ఆధారపడి వుంటున్నాది. ఈ పన్నెండు నెలలలోపల ఒక్కొక్క నెల ముప్పై దినములపైన ఆధారపడి వుంటున్నాది. ఈ దినము 24 గంటలపైన ఆధారపడి వుంటున్నాది. గంట అరవై

srisathyasaivachanamrutam

నిముషల మీద ఆధారపడి వుంటున్నాది. నిముషము అరవై సెకండ్లపైన ఆధారపడి వుంటున్నాది. కనుక, ఒక్కొక్క సెకండుకూడను నూతనమే! సెకండు లేకపోతే నిముషమే లేదు. నిముషము లేకపోతే గంటలు లేవు. గంటలు లేకపోతే నెలలేదు. నెల లేకపోతే సంవత్సరము లేదు. కావున క్షణములపైన నిజ జీవితము ఆధారపెట్టుకోవాలి. క్షణక్షణము ప్రేమమయులుగా వుండి తోటి మానవులందరితో ప్రేమగా మాట్లాడి, ప్రేమగా పలకరించి, ప్రేమ విషయములు విని, సంతోషముగా మన జీవితము గడపాలి. ఈ ద్వేష, అసూయలకేమాత్రము అవకాశము నందించరాదు.

**'నేను మానవుడను, పశువును కాను' అని నీవు ప్రతిక్షణం గుర్తుచేసుకో!**

తరువాత, మానవుడు గుర్తించవలసినది 'నేను మానవుడు' అని. I am man అనేది half truth మాత్రమే. మరొక అర్ధసత్యము ఎక్కడవుంది? I am not animal, యిది రెండవ అర్ధసత్యము. ఈ రెండర్థములు చేరినప్పుడే full manగా నీవు తయారౌతావు. కనుక I am man, I am not animal అని మీకు మీరు ప్రతిక్షణం గుర్తుచేసుకోండి! ఈ భావానికి నీవు వచ్చినప్పుడ animal భావములు నీలో ప్రవేశించకుండా వుంటాయి. నీవు మానవుడని చెప్పుకుంటూ పశువు పనులు చేయటం యిది పవిత్రమైనదేనా? ఎంత అవమానకరమైనది! నీవు మనిషివని చెప్పుకొని పశువుపనులు చేయటం యిది నీకు తగినదేనా? నిజానికి animal is better than you. కనుక, పెడమార్గం పట్టకుండా నీవు మానవుడనే సత్కీర్తి సాధించు. ప్రేమనే ప్రాణంగా విశ్వసించు. ప్రేమతో నిత్యజీవితమును అనుభవించు.

**(తేదీ. 18-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam